కార్యవర్గమువారు తెలిసికొన వలసి యున్నది. మదరాసురాష్ట్ర మంత్రివర్గ సభ్యులు ఆరుగురు ఓడిపోయారంటే ప్రజలకు గత కాంగ్రెసు ప్రభుత్వంపై, దాని కార్యక్రమముపై ఎంత అభిమానముందో స్పష్టంగా వ్యక్తమౌతుంది. మదరాసు ప్రభుత్వం అమలుజరుపుతున్న మద్యపాననిషేధము, కమ్యూనల్ జి. ఓ. లాంటి చట్టాలకు ప్రజలు విముఖులై యున్నందున కాంగ్రెసుకు వ్యతిరేకంగా వోటుచేశారు. వారి ముఠారాజకీయాలు, కులాభిమానాలు ప్రజలను కాంగ్రెసుకు దూరము చేశాయి. కృష్ణా-పెన్నార్, పులిచింతల, రామపాదసాగర ప్రాజెక్టుల్లాంటి ముఖ్యవిషయాల్లో ప్రదర్శించబడిన అవాంఛనీయమైన రాష్ట్రీయాభిమానము కూడా ప్రజలలో కాంగ్రెసుకు పలుకుబడి లేకుండా చేసింది ప్రస్తుతము మదరాసు మంత్రివర్గపువారి కొన్ని కార్యక్రమాలపై, వారి పద్ధతులపై, వారి చర్యలపై ప్రజలకు అభిమానము లేకపోవుటయే కాంగ్రెసు పతనానికి ప్రథమ కారణంగా అధిష్ఠాన వర్గమువారు అంగీకరించి వుండవలసింది.

అంతియగాక యీ ప్రాంతములోనున్న కాంగ్రెసు రథసారథులపై ప్రజలకువిశ్వాసము లేకపోవుటచేత కాంగ్రెసు క్షీణదశకు వచ్చింది. ముఖ్యంగా ఆంధ్ర దేశములో కాంగ్రెసు నాయకులు ప్రజాసేవకొరకుగాక పదవులకొరకై తమలో తాము పోరాడుకుంటూవున్నందున ప్రజలు నిరుత్సాహులై కాంగ్రెసంటే ఏవగించుకుంటున్నారు. ఆంధ్రలో కాంగ్రెసు పతనానికి కొందరు వ్యక్తులు కారణము. అధిష్ఠాన వర్గము యీ వ్యక్తులను బయటపెట్టి వారిపై తగు చర్యతీసికుంటుందా? ఈ ప్రాంతములో యిప్పుడున్న కాంగ్రెసు నాయకత్వము మారితేనే తప్ప తిరిగి కాంగ్రెసు దాని పూర్వపరువు పేరు ప్రతిష్ఠలు స్థాపించుట కలలోని వార్త. కాంగ్రెసు కార్యవర్గము యీ విషయమై తలంచినట్లే లేదు. వీటన్నిటికంటె ముఖ్యంగా భాషాధారక రాష్ట్రపునర్విభజనలో కాంగ్రెసు అవలంబించిన వింత వైఖరి కూడా కాంగ్రెసు అపజయానికి దోహదమిచ్చింది. ప్రత్యేక రాష్ట్రము ఆంధ్రుల చిరకాల వాంఛ. కాని వారి ఆశలు దూరపు కొండలుగానే నిలిచిపోయివున్నందున వారికి కాంగ్రెసుపై విశ్వాసము తగ్గిపోయింది. ఇటువంటి మూల కారణాలను, ముఖ్యమైనవాటిని అధిష్ఠాన వర్గాలవారు గణించక యేవో పైపై పూతలు పూసినట్లయిన వారు యీ ప్రాంతములో కాంగ్రెసును పునరుద్ధరించలేరు.

అతుకుల బొంత

# మాసికల బతుకు

అందె నారాయణస్వామి

ఈ మధ్య పుస్తకాల నిమిత్తం నేనో బీరువా చేయించాను. బీరువా తెచ్చేటప్పుడు పాలిష్ చెయ్యబడి అద్దంలాగా తళతళలాడుతూ ఎంతో ఆకర్షవంతంగా వుండడంవల్ల పనివాడికి ఓ రూపాయి బహుమతిగూడా యిచ్చాను. కొన్ని మాసాలు గడిచేటప్పటికల్లా బీరువా పాలిషు పోయింది సరిగదా పెట్టిన మక్కు వూడిపోయి బెజ్జాలు పగుళ్లు బైటపడినవి. ఎంత మోసం! యీ పనివాళ్ళంతా పట్టి దగాఖోర్లు! ఆ వడ్రంగిమీద నాకు పట్టరాని ఆగ్రహంవచ్చి వెంటనే అతని దగ్గరకు వెళ్ళి మూడుమాటలూ అడిగేశాను. వడ్రంగి ఏమీ ఎరగనివాడల్లే నవ్వి శాంతంగా "అట్లా కోప్పడతారేం బాబు? మక్కులేంది కర్ర పని సాగుతుందా? ఒక్కొక్క చెక్కకు ముళ్లు పగళ్లు బెజ్జాలు వుంటవి. అవి మేమేమీ పెట్టినవి కావు. అవి అసలు చెట్టులోనే పుడతవి. కర్రకు మక్కు పెట్టకుండా మీకు పనిముట్లు కావాలంటే

అసలు చెట్టు యెదిగేటప్పుడు మనం జాగ్రత్త పడాలి" అన్నాడు. ఆ మాటలకు నాకు ఒళ్లు మండిపోయింది, "ఏమిటా చమత్కారం ముళ్లు పగుళ్లులేకుండా సాపైన చెక్కలతో చెయ్య కూడదూ" అన్నాను. "అట్లయితే మేము వేరే తిరుపతి వెళ్ల నవసరం లేదు బాబు. ముళ్లు పగుళ్లు లేని చెక్కలు ఎన్ని వేలతవో ఆ గుట్టలో చూడండి. తతిమ్మా చెక్కలన్నీ ఏంచెయ్యాలి. మక్కు పెట్టకుండా అసలు మీరు పనే చేయించలేరు బాబూ. ఇపుడు మనుషులకే మక్కు కావలసి వస్తూవుండే పాపం ప్రాణంలేని కర్రదాకా పొయ్యారు" అన్నాడు.

వీడు చేసిన తప్పును కప్పిపుచ్చడానికి ఎన్ని అబద్ధాలాడుతున్నాడు అని మనసులో అనుకుని, "నువ్వు కర్రకు పెట్టింది కాకుండా పైగా మనుషులికి కూడా మక్కు తగిలిస్తున్నావు" అన్నాను.

"అబద్ధం అంటూరా! పైగా చదువుకున్న వారు. చూడండి సినిమావాళ్ళు సోడాబుడ్ల లాంటి ముఖాలకు కూడా మక్కుపెట్టి చంద్రబింబాల్లాగా తెరమీదికి తీసుకు రావటంలేదు. అందాకా దేనికి, సర్వసాధారణంగా ఆడవాళ్ళు ముచ్చటగా మొఖాలకు పూసుకుంటున్న ఫేసు పౌడర్లు పెదాలకు రాసుకుంటున్న రంగులు ఏమిటంటూరు మక్కు కాకపోతే" అన్నాడు.

ఇక అతనికి బదులు చెప్పలేకపోయాను. బీరువా శిగతరిగిరి బెజ్జాలు పడితేపడినవి. ఇంత చదువుకుని వడ్రంగికి జవాబు చెప్పలేకపోతినే అన్న బాధతో యింటి దోవ పట్టాను. అతడు మళ్ళీ నన్ను పిలిచి ఓదార్పుగా మక్కు చాలా అవసరమైన వస్తువు తేలిగ్గా చూడకండి. కుర్రకుంక యెట్లా పెట్టాడో యేమో వూడిపోయి వుంటుంది. అనిక్క నేనువచ్చి మళ్ళా మక్కు పెట్టి రైటు చేస్తా లేండి" అన్నాడు. నేను ఇంటికి వచ్చేశాను. నాలో మథన కలిగింది. మక్కు అనే పదానికి నిర్వచనం లోటును కప్పిపుచ్చేదన్న మాట. శాంతంగా ఆలోచించా. మన నిత్య జీవితంలో ఈ మక్కు అనే పదార్థం పోట్లగిత్తలా మనలను యెన్ని రూపాలతో వెంటాడుతూ వుందో?

బంగారం పనివాళ్ళని చూడండి టంకం పెట్టనిది వాళ్ళసలు పనే చేయలేరు. వడ్రంగి పెట్టేమక్కుకు బంగారంపనివాళ్లు పెట్టేటంకానికి పేరు భేదమేగాని రెండిటి ప్రయోజనం ఒకటే. వడ్రంగి చేసిన సామానుకు నిదానంమీద బెజ్జాలు బయటపడితే బంగారం పనివాళ్లు చేసిన నగను కరిగించేనాటికి పెట్టినదానికంటే బంగారం వన్నె తగ్గి వూరుకుంటుంది. ఈమధ్య నేను పట్నంనుంచి ఒక చొక్కాగుడ్డ తీసుకొచ్చాను. అది మిలమిలలాడుతూ సిల్కులాగా మెరసిపోతున్నది. దాన్ని మా ఆవిడ చూచి జాకెట్లు కుట్టించుకొంటానని నామీదికి క్రీకంటి చూపులు విసిరింది. మాపిల్లలు చొక్కాలు కుట్టించుకుంటామని మారాంచేశారు. మళ్ళా అటువంటి గుడ్డ దొరకదని వాళ్ళెవరకూ అందనివ్వకుండా నేనే చొక్కాలు కుట్టించుకున్నాను. చాకలివాడికి వుతకవేద్దునుగదా కుక్క తోలులాగా తయారయింది. నీళ్ళు తగిలేటప్పటికి దానికి పెట్టిన పిండి కొస్తా జారిపోయిందన్న మాట సాధారణంగా మక్కు పెట్టకుండా మిల్లువాళ్ళ గుడ్డను తయారుచేయరు.

వర్తకులు కూడా యీ మక్కును వుపయోగిస్తూ వుంటారు. సాధారణంగా చిల్లర కొట్లు కొనే వాళ్ళతో మూగివుంటవి. వచ్చే జనానికి సరుకులు ఇవ్వటానికి వాళ్లకు ఊపిరాడదు. పల్లెల నుండి ఆసాములు ఒళ్లుతోలుకని వెచ్చాలకోసం బస్తీలకు వస్తూవుంటారు. చిల్లరకొట్టు షావుకారు మూగిన జనంలో భారీగా కొనేవాళ్ళను అంతలో పసిపట్టగలడు. ఈ సందడిలో ఆ ఆసామి మరోచోటికి పోకుండా మర్యాదగా ఆహ్వానించి కూర్చోపెట్టి కొబ్బరిచిప్ప యింత బెల్లంగడ్డ ముందు పడవేస్తాడు. ఆ ఆసామి అవి తింటూ అతని చేతిలో బేరం అయిందాకా బెల్లంకొట్టిన రాయిలా ఇక యెక్కడికీ కదలడు. నోరు తీపి తగిలినవార తర్వాత ధరలలో వుంటుందనుకోండి. అది వేరే సంగతి.

నేనోసారి నాటకానికి వెళ్ళాను. హాలంతా జనంతో క్రిక్కిరిసి పోయింది. రాత్రి పది గంటలైనా నాటకం యింకా ప్రారంభించ లేదు. మన నటకులు తూర్పునుంచి ఒకళ్లు వస్తే పడమటనుంచి ఒకళ్లు రావాలాయె. ముఖ్య పాత్ర

ధారుడు రావడానికి బండి లేటయిందట. ఇంకేం హాల్లో గగ్గోలు ప్రారంభమైంది. ఈలలూ చప్పట్లు కేకలూ వెయ్యడం మొదలు పెట్టారు. ఈ జనమంతా తోసుకుని యెక్కడ తొక్కివేస్తారో అని ముందు కూరున్న మా అందరికీ పీచుపీచుమంటున్నది. ఎంత సేపటికీ నాటకం ప్రారంభించరు. ఉన్న కొందికీ గగ్గోలు అధికమవుతున్నది. గలభా జరుగుతుందని అందరం నిశ్చయించాం. ఇంతలో స్టేజిమీద ఓ వేషం ప్రత్యక్షమయింది. చెవుల పోగులూ కట్టూ బొట్టూ అంతా నిజంగా కొండమామ దిగివచ్చినట్లున్నాడు. అతన్ని చూడగానే హాలంతా నిశ్శబ్దమయింది. ఆ హాస్యగాడు మాది భద్రాచలం అంటూ ఏవేవో చెప్పడం మొదలు పెట్టాడు. కేకలు చప్పట్లతో మారుమోగిన హాలంతా అంతలో నవ్వులతో నిండిపోయింది. ఇంతలోనే నాటకం ప్రారంభించటమూ జరిగింది. తెలివిగల కంట్రాక్టరు ఈ విధంగా లోటును భర్తీచేసి తన పరువు నిలబెట్టుకుంటున్నాడు. సాధారణంగా విదూషకుడు మనకు ప్రతి నాటకంలోనూ కనిపిస్తూనే వుంటాడు. నాటకరంగస్థలానికి విదూషకుడు లోటును కప్పిపుచ్చే మక్కులాంటివాడు.

ఇక్కడో విషయం గుర్తుకొస్తూవుంది. మా యింటికో మారు చుట్టం వచ్చాడు. తన తరఫు బంధువు కావడంవల్ల మా ఆవిడ ఆ రోజున రెండువేపుళ్ళూ ఓపులుసూ పచ్చడీ పప్పూ క్షీరాన్నం మొదలైనవి చేసింది. అతడు తన పనిమీద వెళ్ళి మా భోజనాలు అయ్యాకగాని ఇంటికి రాలేదు. అతడు రావడంతోనే మా ఆవిడ నీళ్లిచ్చి గబగబా వడ్డించింది. యిక్కడ విశేష మేమిటంటే అతడు కూరలతో తినడం అయింది. క్షీరాన్నం తెచ్చి వడ్డించింది యెట్లా పొరపాటుపడ్డదో ఏమో? చూశేసరికి మారు వడ్డించేటందుకు అన్నం తక్కువైంది. అప్పుడు ఎక్కడనుంచి వస్తుంది. మరో కళ్లు మరొకళ్లు కాదు. చుట్టంఆయే. పరువు పోయేటట్టుంది. అతడు మారు వడ్డించమని పిలిచాడు. అప్పుడు నా అర్థాంగి యేమి చేసిందంటే "ఎన్నాళ్ళకో రాకరాక వచ్చావు నీకు అన్నం వడ్డిస్తానా బాబాయ్." అంటూ క్షీరాన్నం తీసికెళ్లి విస్తరినిండా గుమ్మరించింది. ఆ పెద్దమనిషి కిక్కురుమనకుండా కొంత తిని కొంత వదిలివేసి లేచి చెయ్యి కడుక్కున్నాడు.

అందాకా దేనికి యిప్పుడు ఏ భోజనహోటలుకు వెళ్ళినా సరిపడా అన్నం పెట్టరు. కొంత గోధుమ పదార్థంవడ్డిస్తారు. మనం రేషనుబియ్యం తెచ్చుకోబోయినా ప్రభుత్వంవారు బియ్యంతో పాటు కొంత గోధుమలు యిప్పిస్తూన్నారు. గోధుమలు అసలు మనరాజధాని ఆహారం కాదు. అయితే గోధుమలు సరఫరా చెయ్యడం ఏమన్నమాట? ప్రభుత్వంవారు మన ఆకలికి మక్కు పెడుతున్నారన్నమాట.

కవులు మాత్రం సామాన్యులా? పద్య కవిని తీసుకోండి. తగ, బిగి, పరగన్, మొదలైన మక్కు ముక్కలు బిగించంది పద్యం అల్లరు. అన్నట్టు ఆలిండియా రేడియోవారు చూడండి. ప్రోగ్రాముకూ ప్రోగ్రాముకూ మధ్య గప్‌చిప్‌గా రికార్డులు కుక్కి ఆ ఖాళీని కమ్మివేస్తారు. ఇక పత్రికలవారిది మరీ అఘాయిత్యం సుమండీ. ఏ పత్రిక తిరగవేసినా, ఒక వంతు చదువుకునేదైతే రెండు వంతులు పనికిమాలిన అడ్వరుటైజుమెంట్లు. పత్రికలన్నీ మక్కుతో నింపివేస్తూవున్నారు

ఎవర్నని ఏం లాభం. ఈ మక్కుపద్ధతి ప్రపంచం పుట్టినప్పటినుంచీ వున్నదని తోస్తూ వున్నది. బ్రహ్మదేవుడు చందమామను సృష్టించి ఆ ప్రకాశానికి యేకాంతంగా గడుపుతున్న యువతీ యువకులు వెన్నెల రాత్రుల్లో మరీ హైరానా పడిపోతారని దయదలచి కొంత తగ్గించడానికి మక్కు పెట్టి వుంటాడు. అదే చందమామలో యిప్పుడు మనకు కనపడే మచ్చలు.

మనం స్వంతడబ్బా వాయించుకోవడం అలవాటు చేసుకుంటే, మనని చూడగానే తప్పించుకు తిరగడం తక్కినవాళ్లు అలవాటు చేసుకుంటారు.